

ఘనంగా వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండ వెలగాడలో నిర్వహిస్తున్న 12వ రాష్ట్రస్థాయి పురుష, మహిళల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను టిడిపి జిల్లా సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్ ప్రారంభించారు. కార్యక్రమంలో కొండ వెలగాడ టిడిపి నాయకులు దంతులూరి అజయ్‌బాబు, మొయిద శ్రీనివాసరావు, తాడ్డి సత్యనారాయణ, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు కోచ్ చల్లా రాము, అట్టాడ లక్ష్మం నాయుడు, వల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న సువ్వాడ రవిశేఖర్

రైతుబజారుకు స్థలాలు కరువట !

- గుర్తించిన ప్రతి చోటా నిరాకరణే
- చొరవ చూపని ఎమ్మెల్యే, అధికారులు
- రైతులు, వినియోగదారులకు తప్పని అవస్థలు
- టిడిపి లక్ష్యానికి తూట్లు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఏరుదాటే వరకు ఓడ మల్లన్న.. ఒడ్డుకు చేరాక బోడి మల్లన్న అన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. అవసరం తీరుపోయాక అడ్డంగా వదిలేయడం అంటే ఇంతకన్నా ఇదే మరి. అచ్చంగా అలాగే వ్యవహరిస్తున్నారు స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు. అంతకు మించి చొరవ చూపడం లేదు స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు. దీంతో, ఇటు రైతులు అటు వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో, టిడిపి లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు వినియోగదారులకు సరసమైన ధరలకు, తాజాగా కూరగాయలను అందించే లక్ష్యంగా 1999లో అప్పటి టిడిపి (సిఎం చంద్రబాబు) ప్రభుత్వమే రైతు బజార్లను ప్రవేశపెట్టిన సంగతి విధితమే. ఇందులో భాగంగానే విజయనగరంలో ఆర్అండ్‌బి జంక్షన్, దాసన్నపేటతోపాటు పాత మహారాజ ఆసుపత్రి ఆవరణలో రైతు బజార్లను ఏర్పాటు చేశారు. తోటపాలెంలోని బ్యాంకు కాలనీకి వెళ్లే దారిలో ఒక ఎక్స్‌టెన్షన్ కౌంటర్ ఏర్పాటు చేశారు. నాలుగూ నలు దిక్కుల్లో ఉండడంతో నగరంలోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజానీకానికి కూరగాయలు అందుబాటులో ఉండేవి. ఇటీవల కాలంలో రైతు బజార్ స్థలం తమదంటూ గోవా గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు పాత మహారాజ ఆసుపత్రి స్థలాన్ని తీసేసుకున్న సంగతి విధితమే.


ఖాళీ చేయించిన పాత మహారాజా ఆస్పత్రి వద్దగల రైతు బజారు (ఫైల్)

దీంతో, అదే స్థలంలోవున్న రైతు బజారును ఖాళీ చేయించారు. ఈ సందర్భంగా రైతులు తీవ్రంగా ఆందోళన చెందారు. రైతులకు న్యాయం చేయాలంటూ సిపిఎం, నగరంలోని పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఆందోళనా కార్యక్రమాలు జరిగాయి. శాంతియుతంగా ఆందోళన చేస్తున్నవారిపై మున్సిపల్, పోలీసు యంత్రాంగం బెదిరింపు చర్యలకు దిగినప్పటికీ రైతులు, నాయకులు అదరలేదు. చివరకు దిగివచ్చిన అధికార యంత్రాంగం, అప్పటి కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రైతులకు తాత్కాలికంగా దాసన్నపేట రైతు బజారులో దుకాణాలు ఏర్పాటు చేస్తామని, త్వరలోనే నగరంలో మరో స్థలాన్ని గుర్తించి రైతు బజారును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కూడా ఇదే విషయాన్ని చెప్పుకొచ్చారు. కానీ, ఆ తరువాత ఆ కలెక్టర్ బదిలీపై వెళ్లిపోయారు. రైతు బజారు కోసం మున్సిపల్ అధికారులు స్థలాన్ని చూపించడం లేదు. ఎమ్మెల్యే ఆ ఊసే ఎత్తడం లేదు. దీంతో, మార్కెటింగ్ శాఖ అధికారులు పలుచోట్ల స్థలాలను గుర్తించినప్పటికీ, అందుకు మున్సిపల్ కమిషన్ నిరాకరిస్తున్నట్టుగా విశ్వసనీయవర్గ సమాచారం. వాస్తవానికి తోటపాలెంలోని బ్యాంకుకాలనీకి వెళ్లే రహదారిలోవుండే రైతుబజార్ ఎక్స్‌టెన్షన్ కౌంటర్ చాలా కాలంగా ఖాళీగా ఉంది. విశాలమైన స్థలంలో అప్పట్లో మార్కెటింగ్ శాఖ నిర్మించిన షెడ్లు కూడా ఉన్నాయి. ఆ సమీపంలో ప్రైవేటు మార్కెట్ కూడా లేదు. ఈనేపథ్యంలో ఇక్కడ ఏర్పాటుకు సహకరించా లని మార్కెటింగ్ శాఖ ప్రతిపాదన పెట్టినట్టుగా సమాచారం. దీన్ని మున్సిపల్ కమిషన్ భేషరతుగా తిరస్కరించారట. అంతే కాదు .. అది పార్కు స్థలమంటూ తప్పించుకున్నట్టుగా తెలుస్తోంది. జిల్లా పరిషత్ కార్యాలయ గోడకు, స్వీట్ ఇండియాకు మధ్యలో ఖాళీగా ఉన్న స్థలాన్ని కూడా నిరాకరించారు. ఈ ప్రతిపాదన పెట్టిన తరువాత ఇక్కడ రూ.లక్షలు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టడం గమనార్హం. ఆర్టీసి కాంప్లెక్స్ ఎదురుగావున్న పాత మీసేవా కేంద్ర సముదాయాన్ని రైతు బజారు కోసం అడిగిందే తడువుగా అక్కడ అర్బన్ తహశీల్దార్ కార్యాలయం అంటూ ఒక బోర్డు ప్రత్యక్షమైంది. కలెక్టరేట్ వెనుక కనపాక ప్రాంతంలోవున్న జిల్లా ట్రెజరీ కార్యాలయం ఎదురుగావున్న స్థలాన్ని అడిగినప్పటికీ ఉలుకూ పలుకూ లేదట. దీన్నిబట్టి రైతులను ఆదుకోవాలని, వినియోగదారులకు తాజాగా కూరగాయలు అందించాలన్న టిడిపి ప్రభుత్వ లక్ష్యాన్ని స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా పక్కనబెట్టేశారని వేరేగా చెప్పనక్కర్లేదు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుంటే తప్ప రైతు బజారు పునరుద్ధరణ, వినియోగదారుల అవసరాలు, రైతులకు న్యాయం జరిగే అవకాశం కనిపించడం లేదు. ఎలా స్పందిస్తారో వేచిచూడాల్సిందే.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం

- రైతులు ఆదాయం పెంపొందేలా అవగాహన
- శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట, గంట్యాడ

సహజ ఎరువులను వినియోగించడం, ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఆరోగ్యానికి, పర్యావరణానికి ,నేలకు, రైతుకు లాభదాయకని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక యూత్‌క్లబ్‌లో ప్రకృతి వ్యవసాయం పై ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ల శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం ఎక్కువై , వాటి అవశేషాలు మన ఆహారం ద్వారా శరీరంలోకి చేరుతున్నాయని, దానివలన పలురకాల వ్యాధులకు గురవుతున్నామని అన్నారు. ఫలితంగా కాన్సర్ కూడా ఎక్కువైందని అన్నారు. కనుక ఎరువుల వినియోగం, ముఖ్యంగా యూరియా వినియోగం తగ్గించాలని అన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఆకు కూరలు, ఆయిల్ పామ్ వంటి పంటలు సాగు చేయడం ద్వారా వరి వలన పొందే ఆదాయం కన్నా అధికంగా ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్లు గ్రామాల్లో రైతులకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న రైతులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి తారక రామారావు, ప్రకృతి వ్యవసాయం డిడి ఆనందరావు, ఎడి . ప్రకాష్, జిల్లా ఉద్యాన అధికారి చిట్టిబాబు, వ్యవసాయ ఎఒలు, పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలి

రైతులు పండించే పంటకు మార్కెట్ సౌకర్యం లేకుంటే రైతు ఇబ్బంది పడతారని, పంటను విక్రయించుకునే వెసలుబాటు కల్పించాలని వ్యవసాయ అధికారులకు కలెక్టర్ సూచించారు. గంట్యాడ, బొండపల్లి మండలాల్లో పలు గ్రామాల్లో పర్యటించి మామిడి, టమాట, ప్రకృతి వ్యవసాయాన్ని, ఉద్యాన పంటలను సందర్శించారు. కోటారుబిల్లి గ్రామంలో ఈ పంట సూపర్ చెక్ లో భాగంగా నమోదును పరిశీలించారు. వరి, మామిడి పొలాలను సందర్శించి, ఈ పంట నమోదుపై సంతృప్తి వ్యక్తం చేసారు. అదే విధంగా రైతులతో మాట్లాడి వరి, మామిడి పంట విషయంలో ఉన్న ఇబ్బందులను గురించి చర్చించారు. కొండతామరాపల్లిలో టమాటా పంటను పరిశీలించారు. వరి పంటలో రైతులకు నికర ఆదాయం తక్కువగా ఉన్నందున ఉద్యాన పంటల వైపు మళ్ళించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. తదుపరి కొవ్వాడలో సాగు అవుతున్న ప్రకృతి సేద్యం రైతుల పొలాలను పరిశీలించారు. ప్రధానంగా మార్కెటింగ్ సదుపాయంపై దృష్టి పెట్టాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు , ఉద్యాన అధికారి చిట్టి బాబు, ఇతర వ్యవసాయ, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.


గంట్యాడ : కోటారుబిల్లి గ్రామంలో పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

పంచాయతీకార్మికుల సమ్మె

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం, పురిటిపెంట పంచాయతీ కార్మికులకు రెండు నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, కొత్త కార్మికులను వేసుకుంటే మొదటి ప్రాధాన్యత తమ కార్మిక కుటుంబాలకే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం నుంచి సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద రెండు పంచాయతీల కార్మికులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి లక్ష్మీ మాట్లాడుతూ గజపతినగరం, పురిటి పెంట పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు నెల నెలా జీతాలు ఇవ్వడం లేదని, రెండు నెలలకు ఒకసారి బిల్లులు పెడుతున్నా వేతనాలు మాత్రం అవ్వడం లేదన్నారు. నెలలు తరబడి జీతాలు లేకపోవడం వలన వీరి కుటుంబాలు డ్వాక్రా, వైద్యం, విద్య, తిండికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచమంటే పంచాయతీలో ఆదాయం లేదని చెబుతున్నారని, కొత్త కార్మికులను మాత్రం నియమిస్తున్నారని అన్నారు. కొత్తగా కార్మికుల్ని వేసుకునేటప్పుడు కార్మిక కుటుంబాలకి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించకపోతే సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బి. కనకరాజు, అప్పలరాజు , నాగేశ్వరరావు, పి కోటేశ్వరరావు, ఎస్ కృష్ణ, డి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

బాలలే రేపటి భవిష్యత్తు వెలుగులు

ప్రజాశక్తి-గంట్యాడ

నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్తు వెలుగులని ఐసిడిఎస్ పీడీ టి. విమలరాణి అన్నారు. మదనాపురం ఎపి మోడల్ పాఠశాలలో శుక్రవారం జరిగిన జాతీయ బాలల దినోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలల దినోత్సవం పిల్లల పండుగని. పిల్లలందరూ సంతోషంగా ఉండాలని అన్నారు. బాల్యంలో ఆటలు ఆడకుండా చదువుకొని ఉంటే మధుర స్మృతులు కోల్పోతారని. అందుకనే చదువుతోపాటు మనసుకు ఉల్లాసంతో పాటు ఆటలు, పాటలు కూడా చేయాలన్నారు. కార్యక్రమంలో డి సిపియు లక్ష్మి, బెజ్జి పురం ఎన్‌జిఒ ఝాన్సీ రాణి, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ఆర్ రామకృష్ణ, సూపర్‌వైజర్ గాయత్రీ దేవి, పద్మ. మదనాపురం గ్రామ పెద్ద రామునాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

బాలల హక్కులను రక్షించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

బాలల హక్కుల ను రక్షించే బాధ్యత అందరిపైనా ఉందని ఎస్‌పి ఎఆర్ దామోదర్ అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భం గా డిస్ట్రిక్ట్ చైల్డ్ రైట్స్ ఫోరం, ఎపి ప్రో చైల్డ్ గ్రూపు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన వాల్‌పోస్టరును శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ బాలలు స్వేచ్ఛగా జీవించేందుకు, అభిప్రాయం వ్యక్తం చేసేందుకు, విద్యను అభ్యసించేందుకు హక్కులను ప్రసాదించిందని, వాటిని పరిరక్షించే బాధ్యత పోలీసుశాఖతోపాటు ప్రజలందరిపైనా ఉందని అన్నారు. బాలలు లైంగిక వేధింపులకు గురికాకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. డిస్ట్రిక్ట్ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ అధ్యక్షులు పి.చిట్టిబాబు మాట్లాడుతూ బాలల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని పరిరక్షించి బాలల భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిద్దివచ్చునన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డివిఎంసి. సభ్యులు రాము, డాన్ బాస్కో ప్రతినిధి ఇంద్రజిత్తు గుప్తా, డిబిఎస్‌యు కార్యదర్శి ఎం.పి.రాజు, ట్రైబల్ రైట్స్ ఫోరం అధ్యక్షులు నర్సింహ దొర పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌పి, చైల్డ్‌రైట్స్ ఫోరం సభ్యులు


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

సేవలే ప్రజాదర్బార్ ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి కొత్తవలస

ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలందించడమే ప్రజాదర్బార్ ముఖ్యోద్దేశమని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున వచ్చిన ప్రజల నుంచి స్వయంగా పిర్యాధులను స్వీకరిస్తూ తక్షణమే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. అధికారులందరు ప్రతి ఫిర్యాదును స్వీకరించి ప్రజలు 1100 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయడం ద్వారా ప్రతి ఫిర్యాదు పరిష్కార స్థాయిని తెలుసుకునే సౌకర్యం ఉంటుందనీ తెలిపారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, కొత్తవలస మండల టిడిపి అధ్యక్షులు కోళ్ల వెంకటరమణ, ఎల్లపు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి కనకాల శివ, గొరపల్లి రాము, జనసేన ఇన్చార్జ్ వబ్బిన సత్యనారాయణ, బొబ్బిలి అప్పారావు మాస్టర్, చింతలపాలెం సర్పంచ్ మాకేన సీతారాం పాత్రుడు, బంగారు రమేష్, విరోతు శివాజీ, లెంక శ్రీను , నక్కరాజు చిన్న రాము. కోరుపోలు అప్పారావు, గొంప దుర్గా ఉమేష్, కర్రీ సూర్య నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ పథకాలను గ్రౌండింగ్ చేయాలి

మాదిగ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో ఎస్‌సి కార్పొరేషను ద్వారా వివిధ ఎస్‌సి సామాజిక వర్గాలకు అమలు చేస్తున్న పథకాలను గ్రౌండ్ చేయాలని ఎపి మాదిగ వేల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి ఆదేశించారు. శుక్రవారం ఆమె డిఆర్‌డిఎ సమావేశం మందిరంలో ఎస్‌సి పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్‌సి, మాదిగ సామాజిక వర్గాలు, ప్రజలు నుండి వినతులు స్వీకరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్.సి. కార్పొరేషను ద్వారా ఎస్‌సిలకు వివిధ పథకాలు అమలు చేస్తుందని, ఎస్‌సిలు ఈ పథకాలు సద్వినియోగం చేసుకోవడానికి అధికారులు కృషి చేయాలన్నారు. రుణాలు తీసుకున్న లబ్దిదారులు సకాలంలో ఋణాలు చెల్లించడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌సియాక్షన ప్లాన్ ప్రకారం 775 యూనిట్లకు 5896 మంది దరఖాస్తు చేసుకున్నారని, రూ.3215.80 లక్షలు కేటాయించగా, అందులో రూ. 1266.48 లక్షలు సబ్సీడిగా కేటాయించామని తెలిపారవు. ఎస్‌సి, నిరుద్యోగ యువతకు మోటార్ వెహికల్ హెచ్ఎంవి 10 మందిలో 5 గురు పురుషులు, 5 గురు మహిళలకు ట్రైనింగ్‌కు పురుషులు మాత్రమే 22 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో మాదిగలకు సామాజిక భవనం నిర్మించాలని, మాదిగల అభివృద్ధికి రూ.300 కోట్లు కేటాయించాలని, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని తదితర వినతులను చైర్‌పర్సన్ దృష్టికి పలువురు తీసుకెళ్లారు. వినతులు ఇచ్చిన వారిలో దళిత సంఘాల నాయకులు ఉన్నారు. అనంతరం పూల్ బాగ్ లోని షాపులను, ఆర్‌టిజన్ కాంప్లెక్స్ కు 1995లో వేణుగోపాలపురం వద్ద కేటాయించిన స్థలాన్ని తనిఖీ చేశారు. ఎస్.సి. కార్పొరేషను ద్వారా రుణాలుతీసుకున్న లబ్దిదారులు సకాలంలో చెల్లిచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిమాదిగ వేల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లు డి.నాగభుషణం, జి.సుజాత, ఎస్‌సి కార్పొరేషను ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు రాధకుమారి, ఎస్‌సి కార్పొరేషను అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేణుగోపాల పురంవద్ద ఎస్‌సి కార్పొరేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఉండవల్లి శ్రీదేవి

ఎస్‌సి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి : డిబిఎస్‌యు

విజయనగరంటౌన్: ఎస్‌సి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని డిబిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి పి.చిట్టిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవికి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన ఆ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్దరించాలని, వార్షిక యాక్షన్ ప్లాన్ అమలు తక్షణమే చేసి ఎస్సీ నిరుద్యోగులను ఆదుకోవాలని, 2019 - 2020లో ఎన్ ఎస్ ఎఫ్ డి సి కింద ఇచ్చిన కార్ల లోను రుణమాఫీ చేయాలని కోరారు. చైర్‌పర్సన్ స్పందిస్తూ బడ్జెట్ కేటాయింపునకు రూ.340 కోట్లు ఎస్సీ కార్పొరేషన్ కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిబిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంపి రాజు, జిల్లా ఉపాధ్యక్షులు గొల్ల బాబు, వై.బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

58వ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం జిల్లా అంతటా ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాలను రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ సభ్యులు ఆర్.రామూర్తి నాయుడు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలు తమ భావాలను కూర్పు చేసి పుస్తక రూపంలో పెట్టేదాన్ని గ్రంథాలు అంటారన్నారు అటువంటి గ్రంథాలను పుస్తకాలను ఒక దగ్గర ఏర్పాటు చేసే దాన్ని గ్రంథాలయాలు అంటారన్నారు. ఆ గ్రంథాలయాలే సరస్వతి నిలయాలన్నారు. ఈ గ్రంథాలయాలు నిరుద్యోగులు వారి జీవితాలను బాగు చేసుకోవడానికి ఉపయోగపడతాయని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞాన ప్రబోధానికి ఆధార స్తంభాలు అని కొనియాడారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి బి. లక్ష్మీ మాట్లాడుతూ ఈ గ్రంథాలయ వారోత్సవాలను 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజులు పాటు నిర్వహిస్తామన్నారు. ఒక్కొక్క రోజు ఒక ప్రత్యేకమైన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. జిల్లాలో గ్రంధాలయాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో సిబ్బంది కొరత, గ్రంథాలయాల సెస్ నిధుల సేకరణ, పుస్తకాల నవీకరణ, వసతుల కల్పన వంటివి పరిష్కరించేందుకు ఎపిజిపి సభ్యులు కలిసి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ ఎ.గోపాల్‌రావు, జిల్లా గ్రంథాలయ ఉద్యోగ సంఘ అధ్యక్షులు కె.శ్రీనివాస్, గ్రంథాలయ సహాయ అధికారి ఎస్ .జ్యోతి, సంఘసేవకులు షేక్‌బాషా పాల్గొన్నారు.

గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో

విజయనగరం టౌన్ : కోటలో గల స్కూల్ ఆఫ్ మేనేజ్ మెంట్ స్టడీస్ గ్రంథాలయంలో గ్రంథాలయ సదస్సు నిర్వహించారు. ముందుగా మాన్సాస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పివిజి రాజు, గ్రంథాలయ కార్యకర్త రెడ్డి రమణ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కొత్తలి ఎర్నాయుడు, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులు కె.దయానంద్ మాట్లాడుతూ గ్రంథాలయాల పట్ల అవగాహన కలిగించేందుకు వారోత్సవాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానంతో బాటు మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల, కళాశాల గ్రంథాలయల కన్వీనర్ రామభద్రరాజు, గమ్యం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు వేమలి చైతన్య బాబు, వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, అధ్యాపకులు హరికృష్ణ, లైబ్రేరియన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.


నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ పరిషత్ సభ్యులు, కార్యదర్శి లక్ష్మి

శృంగవరపుకోట : స్థానిక శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఎంఇఒ -2 గణపతి లక్ష్మీ శుక్రవారం ప్రారంభించినట్టు శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. విద్యార్థులు దేశ నాయకుల వేషధారణతో అలరించారు. ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, కటకం పావని సర్వేపల్లి విద్యానికేతన్ కరస్పాండెంట్ సుశీల, మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ సహాయకులు రెడ్డి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని మంచి విద్యావంతులుగా తయారవ్వాలని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసు పాల్గొన్నారు.

తెర్లాం : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ దినోత్సవాన్ని ఆ శాఖ అధికారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఇఒ జె.త్రినాధ రావు, జెడ్‌పి హైస్కూలు హెచ్ఎం ఎస్ఎస్ రమేష్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఎంఇఒ మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని అన్నారు.

జిజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గత మూడు నెలల నుంచి కుడి చెవిలో నొప్పి, తల తిరగడం, చెవిలో హోరు , వినికిడి లోపంతో ఇబ్బంది పడుతున్న జ్ఞలక్ష్మి అనే మహిళకు ప్రభుత్వ మెడికల్ వైద్య కళాశాలలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ప్రైవేట్ వైద్యంలో నయం గాక ప్రభుత్వ ఆసుపత్రిలో ఇఎన్‌టి డిపార్ట్మెంట్ వైద్యులను ఈనెల 10న సంప్రదించింది. వైద్యులు పరీక్షించి, స్కానింగ్ పరీక్షలు చేసి అరుదు గా వచ్చే చెవికి సంబంధించిన ట్యూమర్ గ్లోమస్ జుగులరే (కణితి)గా నిర్ధారించారు. ఆమెకు గురువారం సుమారు మూడుగంటలు పాటు ఇఎన్‌టి, అనస్థీషియో వైద్యులు శ్రమించి శస్త్రచికిత్స చేశారు. దీంతో ఆమె కోలుకుంటున్నారు.

మృతి చెందినా మరో ఇద్దరికి కంటి చూపు

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎస్.కోట మండలానికి చెందిన ఎం.అనిల్ కుమార్ వర్మ (39) మరణించారు. ఈనేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యుల అంగీకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ఎ.రమణ మృతునికి కార్నియాలను మెడికల్ సూపర్‌డెంట్ జిజిహెచ్ ఆస్పత్రి అనుమతితో ఫారెన్సిక్ డాక్టర్ పర్యవేక్షణలో ఆప్తల్మిక్ విభాగం సహకారంతో కార్నియాలు సేకరించి ఎల్‌వి ప్రసాద్ ఐ బ్యాంకుకు పంపించారు. మృతి చెందిన అనిల్ కుమార్ వర్మ కళ్ళు దానం చేయడంతో మరో ఇద్దరికి కంటి చూపును ఇచ్చినట్లయ్యింది.

నీటి ఛార్జీ వసూళ్లను ముమ్మరం చేయాలి

ప్రజాశక్తిగీవిజయనగరం టౌన్

నీటి ఛార్జీ వసూళ్లను ముమ్మరం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. దీంతో అన్ని సచివాలయాల పరిధిలో కార్యదర్శులు నీటి ఛార్జి వసూళ్లను చేపట్టారు. ఈ ప్రక్రియను సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకొని కార్యదర్శులకు తగు సూచనలు జారీ చేశారు. పలు ప్రాంతాలలో పారిశుధ్య పనితీరును ఆయన గమనించారు. రహదారులకు ఆనుకుని భవన వ్యర్థాలు ఉండడాన్ని చూసి సిబ్బందిని మందలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీటి చార్జీలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చెల్లించాలన్నారు. లేని యెడల కుళాయి కనెక్షన్లను తొలగించి వేస్తామని చెప్పారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి : కర్రోతు

ప్రజాశక్తి-డెంకాడ

పార్టీని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్క్‌ఫెడ్ చైర్మన్, నియోజక వర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా ఎన్నికైన వివిధ కమిటీల సభ్యులంతా ప్రభుత్వ అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను పాల్గొన్న ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కరరావు, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి పతివాడ విద్యాసాగర్ నాయుడు, రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ చీకటి సుహాసిని, మహిళా అధ్యక్షురాలు చిల్లా పద్మ , పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి పాణిరాజు ,పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు ప్రదీప్‌రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కర్రోతు బంగార్రాజు

అమృత హాస్పిటల్ తనిఖీ

రాజాం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి జిల్లాలో ఎఆర్‌టి లెవెల్ - 2, ఎఆర్‌టి బ్యాంక్ అనుమతి కోసం నమోదు చేసుకున్న రాజాంలోని అమృత హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. ఎఆర్‌టి లెవెల్ - 2, ఎఆర్‌టి బ్యాంక్ లో అందించే సేవలలో భాగంగా చేయబోయే ప్రాసెసింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్.ఉమా మహేశ్వరి , రేడియాలజిస్ట్ డాక్టర్ లావణ్య, పేథాలజిస్ట్ డాక్టర్ స్వాతి, ఎన్‌జిఒ జికె దుర్గా, మానిటరింగ్ కన్సల్టెంట్ పవన్ ఆశిష్, డెమో వి. చిన్నతల్లి , డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎం. చాముండేశ్వరి పాల్గొన్నారు

తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

ఉప విద్యాశాఖధికారి కెవి రమణ

ప్రజాశక్తి-డెంకాడ

వికలాంగుల పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని జిల్లా ఉప విద్యాశాఖధికారి కెవి రమణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలోని భవిత కేంద్రంలో వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకారణాలకై వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. జిల్లా సమగ్ర శిక్షా, విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల పరిధిలోని మండలాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డిఇఒ మాట్లాడుతూ సాధారణ పిల్లల వలే వీరిలో కూడా సామర్థ్యాలు ఉంటాయని, వీటిని గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్. సూర్యారావు మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులకు పలు రకాల ఉపకార వేతనాలు వారి తల్లిదండ్రుల ఖాతాలో జమ చేశామన్నారు. ఈ శిబిరానికి విజయనగరం, నెల్లిమర్ల, పూసపాటిరేగ, భోగాపురం, డెంకాడ మండలాల నుండి 160 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 135 మంది విద్యార్థులు వివిధ రకాల ఉపకారణాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఆర్.కృష్ణ, బి.పాపి నాయుడు, ఎమ్. రమణమూర్తి, సహిత విద్య సహా కోఆర్డినేటర్ ఎమ్. భారతి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పలు అక్రమ నిర్మాణాలపై ప్రణాళిక విభాగం సిబ్బంది శుక్రవారం కొరడా ఝుళిపించారు. తోటపాలెం, ఎంజి రోడ్డులో అక్రమంగా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతుండటంతో టిపిఒ అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్మాణాలను కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇ-పంటపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-గజపతినగరం

మండల వ్యాప్తంగా ఈ పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను సామాజిక తనిఖీల్లో భాగంగా రైతు సేవా కేంద్రాల వద్ద మూడు రోజులపాటు పరిశీలనకు అందుబాటులో ఉంచుతున్నట్లు ఎడిఎ నిర్మిలా జ్యోతి తెలిపారు. ఎఎంసి చైర్మన్ పివివి గోపాల రాజు అధ్యక్షతన పురిటిపెంట, వెంకటాపురం గ్రామాల్లో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. రైతుల జాబితా పై అభ్యంతరాలను సేకరించిన అనంతరం సవరణ చేసి 17న తుది జాబితాను రైతు సేవా కేంద్రాల్లో పరిశీలనకు పెట్టి ఆ జాబితాను ధాన్యం కొనుగోలుకు నిమిత్తం సివిల్ సప్లై శాఖకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ కిరణ్ కుమార్, టిడిపి నాయకులు వివి ప్రదీప్ కుమార్, పిఎసిఎస్ డైరెక్టర్ గొర్లె బంగారు నాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల ఆగ్రహం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

153 రోజులుగా తమకు న్యాయం చేయాలని నిర్వాసితులు పోరాడుతుంటే ఎంఎస్ఎంఇ పార్కుకు త్వరలో శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే ప్రకటించడం సరికాదని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వారంతా నిరసన తెలిపారు. అనేకమార్లు ఎమ్మెల్యేకి విన్నవించినా కనీస స్పందన లేదన్నారు. రైతులకు , నిర్వాసితులకు అండగా నిలవాల్సిన ఎమ్మెల్యే, కంపెనీతో కుమ్మక్కై వారి స్వలాభం కోసం మా దళిత, గిరిజనుల భవిష్యత్తును తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్న తీరును పూర్తిగా ఖండిస్తున్నామని అన్నారు. తమ భూముల కోసం ఎంతవరకైనా పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం నాయకులు చల్లా జగన్, నిర్వాసితులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు

కుష్టు నిర్మూలనకు అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ రీనా చౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం కుష్టు వ్యాధి నిర్మూలనకు ర్యాలీ నిర్వహించి, ఆశా, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 17నుంచి 30వ తేదీ కుష్టు వ్యాధి నిర్మూలనపై 14 రోజుల పాటు ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించాలన్నారు. కుష్టు రహిత సమాజం కోసం సిబ్బంది అంతా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రాధాకృష్ణ, పిహెచ్ ఎన్.సావిత్రి , సూపర్వైజర్ సాయికృష్ణ, ఎంఎల్హెచ్‌పిలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తవలస : కుష్టు వ్యాధిగ్రస్తులు నిర్మూలనే ధ్యేయంగా అందరూ పాటుపడాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శీతల్ వర్మ తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ అప్పలకొండ, ఇఒ సన్యాసినాయుడు, సూపర్వైజర్ సూరిదేముడు, బేబీ రాణి, నిర్మల, హెచ్ పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.


కార్యకర్త పాపినాయుడును పరామర్శిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

కార్యకర్తను పరామర్శించిన చిన్నశ్రీను

ప్రజాశక్తి -చీపురుపల్లి

మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్నందుకు నిరసనగా ఈనెల 12న పట్టణంలో జరిగిన ర్యాలీలో వైసిపి కార్యకర్త పర్ల గ్రామానికి చెందిన సిరియాల పాపినాయుడుకి కాలికి గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను,) శుక్రవారం పరామర్శించారు. అనంతరం బాధితుడి ఆరోగ్యం ఆరోగ్య పరిస్థితిని అక్కడ ఉన్న వైద్యులు అడిగి తెలుసుకున్నారు. అలాగే పాపి నాయుడుకి అన్ని విధాలుగా అండదండగా ఉండాలని స్థానిక నాయకులకు మజ్జి శ్రీనివాసరావు సూచించారు. ఆయన వెంట వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలి రెడ్డి శ్రీనివాస్ నాయుడు, మీసాల వరహాలు నాయుడు ఉన్నారు.

మన డబ్బులు మన లెక్కలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - మెరకముడిదాం

మండలంలోని బుధరాయివలసలో గ్రామ సమైక్య సంఘ సభ్యుల ప్రత్యేక సమావేశం జరిగింది. సంఘ అధ్యక్షులు బాలి లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మన డబ్బు మన లెక్కలపై ఎస్‌హెచ్‌జి సభ్యులు అవగాహన కల్పించారు. ఇందులో ప్రతి చిన్న సంఘం ఆర్థిక లావాదేవీలు మొబైల్ యాప్ ద్వారా మన డబ్బు మన లెక్కలు తెలుసుకునే అవకాశాన్ని సభ్యులకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో ఎపిఎం రాజశేఖర రావు, సిసిలు, విఒఎలు, ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది




విజయనగరంలోని గురజాడ స్కూలు, మదర్ థెరిసా కిడ్స్ స్కూలులో వివిధ వేషధారణలతో విద్యార్థులు; గాజులరేగ నారాయణ పబ్లిక్‌స్కూలులో ఆకట్టుకున్న చిన్నారులు

జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటాలకు ఆయా విద్యాసంస్థల నిర్వాహకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలతో అలరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. విజయనగరంలోని గురజాడ పాఠశాల, మదర్ థెరిసా కిడ్స్, గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూళ్లలో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పోలీసు వెల్ఫేర్ స్కూలులో విద్యార్థులు డాన్సులతో ఆకట్టుకున్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి అనంతరం ఎస్‌పి ఎఆర్ దామోదర్ ఆధ్వర్యాన బహుమతులు అందజేశారు. శృంగవరపుకోటలోని డాక్టర్ వరలక్ష్మి స్కూలులో విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. - ప్రజాశక్తి విలేకర్ల బృందం





ధర్మపురిలోని తన జెడ్‌పి చైర్మన్ నివాసంలో చిన్నారులతో సిరి సహస్ర; పోలీసు వెల్ఫేర్ స్కూలులో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు; ఎస్.కోటలోని వరలక్ష్మి స్కూలులో విద్యార్థుల వేషధారణలు

విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

బాలల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, స్థానికజూనియర్ సివిల్ జడ్జ్ కుమారి బి.కనకలక్ష్మి అధ్యక్షతన ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సును ఉద్దేశించి న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుండే సరైన లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటి లక్ష్య సాధనకై నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, ఎజిపి టి.వెంకటరమణ, ఎస్.కోట న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి.సూర్యదేముడు, బివి రామారావు, ఉపాధ్యక్షులు బి.వెంకట్రావు, సిఐ వి.నారాయణ మూర్తి, న్యాయవాదులు అల్లు సత్యాజీ, బి.సత్యనారాయణ, వారాది ఈశ్వరరావు, బొబ్బిలి రామకృష్ణ, ఎం.అనురాధ, మండల సేవా కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి కనకలక్ష్మి

చట్టాలపై అవగాహన ఉండాలి

గజపతినగరం : బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి (జడ్జి) విజయ్‌కుమార్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పిల్లలు తప్పనిసరిగా చట్టాలపై, వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు వంటి సామాజిక సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సమస్య వచ్చినా ఉచిత న్యాయ సాయాన్ని పొందవచ్చని వివరించారు. ముఖ్యంగా, విద్యార్థులు చదువుతో పాటు మంచి నడవడిక, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి అభినందన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, పలువురు న్యాయవాదులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనలో క్రెడిట్ చోరీ

ప్రజాశక్తి - బొబ్బిలి

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసిపి హయాంలో అమలు చేసిన పథకాలు, ఎంఒయులను తామే చేసినట్లు ప్రచారం చేసి క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని వైసిపి నాయకులు విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం అయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో విశాఖలో పారిశ్రామిక దిగ్గజలతో సమ్మిట్ నిర్వహిస్తే నేడు తామే ఆయా కంపెనీలు తెచ్చినట్లు ప్రచారం చేయడం అన్యాయమన్నారు. ఎబిసి లిమిటెడ్ కంపెనీ రూ.1.20లక్షల కోట్లు, రెన్యూ పవర్ రూ.97.50వేల కోట్లతో వైసిపి ప్రభుత్వం ఎంఒయు చేసుకుంటే నేడు తాము చేసుకున్నట్లు చెప్పడం సరికాదన్నారు. ఎన్‌టిపిసి, సెంచూరియన్, ఎటిసి టైర్స్, రిలియన్స్ ప్రాజెక్టులు ఒప్పందం కూడా వైసిపి హయాంలో జరిగినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు ఇంటి గోపాలరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు మురళీ, రామభద్రపురం మండల నాయకులు రాయల్, న్యాయవాది మజ్జి జగన్నాథం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ప్రోత్సాహం

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని రఘుమండ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1997-98 పూర్వ విద్యార్థుల సహకారంతో బాలల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, పద్య పఠనం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థుల ప్రతినిధులుగా అప్పారావు, శ్రీ గురు నాయుడు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చిరంజీవి పాల్గొన్నారు. విద్యార్థులను ప్రోత్సహించిన పూర్వ విద్యార్థులకు హెచ్‌ఎం ఇందిరా దేవి, తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాస రాజు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

జీరో టిల్లెజ్‌తో తక్కువ ఖర్చు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలో చొల్లంగిపేటలో దంతులూరి విజయభాస్కర రామరాజు పొలంలో మొక్కజొన్న విత్తనాలను జీరో టిల్లెజ్ విధానంలో జిల్లా వనరుల కేంద్రం డిడి భారతి, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.నాగభూషణరావు, మండల వ్యవసాయ అధికారి టి.సంగీత ఆధ్వర్యంలో వేయించారు. నాగభూషణ్ రావు మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో జీరో టిల్లెజ్ విధానం వల్ల విత్తన ఖర్చు తగ్గడంతో పాటు దుక్కు ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు.. పినతడివాడి గ్రామంలో ఈ పంట గ్రామసభలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారిని సంగీత మాట్లాడుతూ ఈ పంటలో సోషల్ ఆడిట్ లో భాగంగా ఇ-పంట వేసిన రైతుల జాబితాను చదివి వినిపించారు. కార్యక్రమంలో పినతాడివాడ గ్రామ సర్పంచ్ లక్ష్మణరావు, గ్రామ రైతులతో పాటు వ్యవసాయ విస్తరణ అధికారి బి.రామకోటి, గ్రామ వ్యవసాయ సహాయకులు రాంబాబు, శాలిని పాల్గొన్నారు.

మహిళలంతా విద్యావంతులు కావాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

నిరక్షరాస్యత మహిళలలంతా విద్యావంతులు కావాలని ఎంఇఒ-2 వాసు అన్నారు. పొదుపు సంఘాలు, ఉపాధి కూలీలను విద్యావంతులుగా తీర్చేందుకు ఉల్లాస్ కార్యక్రమాన్ని ఆయా శాఖల ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంతకం చేయడం, చదవడం, రాయడం, చిన్న చిన్న లెక్కలు చేయడం నేర్చుకోవాలని సూచించారు. అందుకు ప్రభుత్వం మహిళలకు శిక్షణ ఇస్తుందని ఈ శిక్షణలో ప్రతి నిరక్షరాస్యత మహిళ విద్యావంతురాలు కావాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ అప్పారావు , ఎపిఎం భాజి , ఎపిఒ లక్ష్మీ పతిరాజు, మహిళలు పాల్గొన్నారు

అంగన్‌వాడీ కేంద్రాల విలీనం ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్


వినతినిస్తున్న అంగన్వాడీలు

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం ఆపాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం రంగరాయ పురం సచివాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పి.శంకర్రావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో కలిపితే అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యోగాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రీ స్కూలు పిల్లల హాజరు తగ్గుతుందన్నారు. ప్రీ స్కూలు పిల్లలకు మెనూ చార్జీలు పెంచాలని, 3 నుండి 6ఏళ్ల పిల్లలు అంగన్‌వాడీలోనే ఉండాలని, ప్రీ స్కూలు పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యదర్శి కి వినతిపత్రం అందజేశారు.

ప్రీ స్కూల్ పిల్లలతో బలోపేతం చేయాలి

ప్రజాశకర్తి - వంగర

అంగన్వాడీ సెంటర్లలో ప్రీస్కూల్ పిల్లలతో ప్రభుత్వం బలోపేతం చేయాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు అంగన్వాడీ యూనియన్ పిలుపుమేరకు సచివాలయాల కార్యదర్శులకు శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. అంగన్వాడీ సెంటర్లను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం ఆపాలని, 3 నుండి 6 ఏళ్లలోపు పిల్లలను అంగన్వాడీ సెంటర్‌లోనే ఉండేవిలా జీవో ఇవ్వాలని, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

కంటోన్మెంట్ : విజయనగరం పట్టణంలోని నాలుగో సెక్టార్ వైఎస్ఆర్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో చిల్డ్రన్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ప్రసన్న మాట్లాడుతూ ప్రతి చిన్నారికి జీవించే హక్కు, రక్షణ, విద్య, భాగస్వామ్యపు హక్కు కలిగి ఉంటారని తెలిపారు. 3నుండి ఆరేళ్ల పిల్లలు అంగన్వాడీ కేంద్రంలోనూ 6 నుంచి 14 ఏళ్ల పిల్లలు స్కూల్లోనూ ఉండాలని, ఎవరు కూడా డ్రా పౌట్స్ ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అర్.పైడితల్లి, అంగన్వాడీ కార్యకర్తలు చంద్రకళ, ఎంఎస్‌కె పాల్గొన్నారు.

కొర్లాం బూత్ లెవెల్ ప్రెసిడెంట్‌గా'బొండా'

ప్రజాశక్తి - మెరకుముడిదాం

మండలంలోని కొర్లాంలో టిడిపి బూత్ లెవెల్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. బూత్ లెవెల్ కమిటీ ప్రెసిడెంట్‌గా కొర్లాంకు చెందిన బోండా సుందర్రావు, వైస్ ప్రెసిడెంట్‌గా బూర్లె శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. బూత్ లెవెల్ ఆర్గనైజేషన్ కార్యదర్శిగా బూర్లె బుచ్చం నాయుడు ఎన్నికయ్యారు. ఆయన గతంలో కొర్లాం సర్పంచ్ గా పనిచేసి ఉన్నారు. బూత్ లెవెల్ కమిటీలు ఎన్నిక కావడం పట్ల మండల టిడిపి అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు, సీనియర్ నాయకులు కోట్ల మోతీలాల్ నాయుడు, పార్టీ కార్యదర్శి కెంగువ ధనంజయ తదితరులు అభినందనలు తెలిపారు.

పోస్టాఫీసులో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సేవలు

ప్రజాశక్తి - గజపతినగరం

పెన్షనర్లు పోస్ట్ ఆఫీసులో సులభంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను చేసుకోవచ్చునని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పెన్షనర్లు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, పిపిఒ వివరాల ఇచ్చి బయోమెట్రిక్/ ఫేస్ స్కాన్ ద్వారా రూ.70 చెల్లించి సులభంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ చేసుకోవచ్చునని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోస్ట్ ఆఫీసులలో ఈ సేవలు అందుతాయని, దీన్ని పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959990320 ను సంప్రదించాలని కోరారు.

పెన్షన్ దారులు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమ సంఘం కార్యవర్గ, ఇతర సభ్యులు తమ లైఫ్ సర్టిఫికెట్లను ట్రెజరీకి అందజేయాలని పింఛను దారులు సంఘం అధ్యక్షులు రామచంద్రపండ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులంతా జీవన ప్రమాణ పత్రాలు, లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సిన పీరియడ్ 01.01.2026 - 28.02.2026 మధ్య కాలంలో మాత్రమే అందజేయాలన్నారు. ఈ ధ్రువపత్రాలు ట్రెజరీ కార్యాలయాల్లో గానీ, నెట్ సెంటర్లో గానీ చేసుకొనుటకు అవకాశం ఉందన్నారు. కావున ఈ విషయం పింఛనుదారులంతా గమనించాల్సిందిగా కోరారు. చవలసినదిగా కోరారు.

ఆదర్శంగా విశ్రాంతి ఉద్యోగుల జీవనం సాగాలి

ప్రజాశక్తి చీపురుపల్లి

విశ్రాంతి ఉద్యోగుల ఆదర్శంగా జీవనం కొనసాగాలని మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ఆంజనేయపురంలో ఎపి రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ చీపురుపల్లి, మండలం వన మహోత్సవ (పిక్నినిక్) కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెల్లాన మాట్లాడుతూ ఇటువంటి పిక్నిక్‌ల ద్వారా అటు మానసిక సంతోషానికి, ఇటు సమాజ సేవ చేయడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం పలువురిని ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

70 శాతం ఉద్యోగాలు ఉత్తరాంధ్రకు కేటాయించాలి

విజయనగరం టౌన్ : వాణిజ్య ఒప్పంద పరిశ్రమల్లో ఉత్తరాంధ్రకు 70 శాతం ఉద్యోగాలు కేటాయించాలని బిసి, ఎస్‌సి,ఎస్‌టి, మైనారిటీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఐక్యవేదిక సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, రొంగలి రామారావు, ఇప్పిలి రామారావు, బూర ఐశ్వర్య యాదవ్, లాయర్ కరీం, దిమిలి పైడిరాజు, మాట్లాడారు. ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లాల ప్రజలు అయినందున పరిశ్రమలలో స్థానిక కోటాకింద 70శాతం ఉద్యోగ అవకాశాలు కేటాయించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు పై సమీక్ష

ప్రజాశక్తి-సంతకవిటి

మండలంలోని మందరాడ రైతుసేవా కేంద్రంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై 18 క్లస్టర్ల విఎఎ, పిఎస్‌ఎ - ఎఫ్ పిఒ, టిఎలు, డిఇఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సి.బి యశ్వంత్‌రావు మాట్లాడుతూ గోనె సంచులు, తూకం కళాసులు, ట్రాన్స్‌పోర్ట్, ధాన్యం కొనుగోలు విధానం, మాయిశ్చర్ మీటర్ వినియోగం, ట్రక్ షీట్, ఎఫ్‌టిఒజనరేషన్ వంటి అంశాలపై వివరించారు. టెస్టింగ్ పరికరాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. సంతకవిటి ఎఫ్ పిఓ సిఇఒ కురిటి సోమేశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి -బొబ్బిలి

పట్టణంలో బాలల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలల దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలలో బాలల దినోత్సవం నిర్వహించి జాతీయ నాయకుల వేషధారణతో పిల్లలు అలరించారు.

రాజాం : పట్టణంలో గల సన్ స్కూల్లో పాఠశాల ప్రిన్సిపల్ వై.భారతి అధ్యక్షతన బాలల దినోత్సవ నిర్వహించారు. తొలుత జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల విలీనాన్ని ఆపాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారన్న కారణం చూపి అంగన్వాడి సెంటర్‌ను విలీనం చేయాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని యూనియన్ నాయకులు జె.కామేశ్వరి, ఉమాగౌరి, అనురాధ కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యాన పూల్‌బాగ్, మల్లంపేట, పాత బొబ్బిలి సచివాలయాల్లో వినతులు అందజేశారు. ఎఫ్ ఆర్ ఎస్ రద్దు చేయాలని, మెనూ క్వాంటిటీ పెంచాలని, ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫారాలు ఇవ్వాలని కోరారు.

ఆర్‌టిసి డిపో వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-విజయనగరంకోట


ధర్నా చేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

పని గంటలు పెంపు, స్త్రీశక్తి పథకం అమలులో సమస్యలు, అక్రమ సస్పెన్షన్లకు నిరసనగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఆర్‌టిసి డిపో గేటు వద్ద శుక్రవారం ఉద్యోగులు ధర్నా చేశారు. సిబ్బంది నియామకం చేపట్టాలని, డీజిల్ బస్సులు కొనుగోలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులు నిర్వహణ ఆర్‌టిసిలకే ఇవ్వాలని, అన్నిరకాల బకాయిలు చెల్లించాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటరావు, డిపో కార్యదర్శి ఎ.చంద్రయ్య, అధ్యక్షులు ఎస్‌కె రఫీ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బి నాయుడు, జెఎస్ నారాయణ, పివి రావు, కె.ఆర్. లక్ష్మి, లావణ్య, లక్ష్మి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ దాడులు

25 మందిపై బైండోవర్ కేసులు నమోదు

ప్రజాశక్తి - రాజాం

స్థానిక ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో గతంలో అనధికార బెల్ట్ షాపులు కేసుల్లో నిందితులైన 9మంది పాత నేరస్తులను, అలాగే 16 మంది అనుమానితులను బైండోవర్ చేశారు. వీరిని రేగిడిఆమదాలవలస తహశీల్దార్ ఎదుట హాజరు పర్చి ప్రతి ఒక్కరికి ఒక లక్ష రూపాయలతో పాటు, పూచీకత్తుపై ఒక ఏడాదికి బైండోవర్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

హత్య కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

జిల్లాలోని ఎల్. కోట పోలీసు స్టేషన్లో 2021లో జరిగిన భూతగాదాల వల్ల ఎల్.కోట మండలం రేగ గ్రామానికి చెందిన వ్యక్తిని అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కొడవలి, కర్రలతో దాడి చేసి హత్య చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు, రూ.3వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. రేగ గ్రామానికి చెందిన గొల్ల ఈశ్వరరావు (45)కు, అతని సోదరుడికి భూతగాదాలు జరుగుతుండేవన్నారు. ఈ విషయమై 2021 జులై 25న అన్నయ్య గొల్ల విశ్వనాథం, కుటుంబ సభ్యులు ఇంట్లోకి ప్రవేశించి గొల్ల ఈశ్వరావుతో గొడవ పడి, కొడవలి, కర్రలతో దాడి చేసి హత్య చేసారని తెలిపారు. ఈ విషయమై మృతుడి కొడుకు గొల్ల బాలాజీ ఎల్. కోట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ కె. లక్ష్మణ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని తెలిపారు. అదే గ్రామానికి చెందిన గొల్ల అప్పారావు, గొల్ల విశ్వనాథం, గొల్ల దేముడమ్మ, గొల్ల లక్ష్మిని అరెస్టు చేసి, న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారని తెలిపారు.పోలీసు వారి తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటరు జి.సత్యం వాదనలు వినిపించారని ఎస్‌పి తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో నిందితుడికి వారం రోజులు జైలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక పోలీసు స్టేషను పరిధిలో దేవీకూడలి వద్ద మద్యం సేవించి వాహనం నడిపి పోలీసులకు పట్టుబడిన నిందితుడు వేపాడ మండలం ఆతవ గ్రామానికి చెందిన ఆతవ రామకృష్ణకు 7 రోజుల జైలు శిక్ష విధించినట్లుగా ఎస్సై చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. స్థానిక స్పెషల్ జ్యుడిషియల సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గండి అప్పలనాయుడు ఈ శిక్ష విధించారని తెలిపారు.